క్లుప్తంగా

అలరించిన స్వర రాగ తరంగిణి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్‌లోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమావేశ మందిరంలో భద్రాద్రి మెలోడీ సింగర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్వరరాగ తరంగిణి కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. గాన గాంధర్వుడు, దివంగత ఎస్పీ బాల సుబ్రమణ్యం జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ సంగీత లహరి కార్యక్రమంలో 30 మంది గాయకులు పాల్గొని గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాకాల దుర్గా ప్రసాద్, గోళ్ల భూపతిరావు, జెట్టి లలిత, జెఆర్ మూర్తి, దుర్గా చారి, నాగమణి గాయకులు దుర్గా ప్రసాద్, నాగమణి, జ్యోతి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా..

పినపాక: ఆటో అదుపు తప్పి బోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని మల్లారం గ్రామసమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లికి చెందిన ముగ్గురు జేసీబీ డ్రైవర్లు అశ్వాపురం గ్రామానికి చెందిన యువకుడి ఆటోలో రాజపేట వెళ్తున్నారు. ఈ క్రమంలో మల్లారం మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఘటనలో నలుగురికి గాయాలు కాగా, క్షతగాత్రులను 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

దమ్మపేట: దమ్మపేట గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాల స్థావరంపై స్థానిక పోలీసులు సోమవారం దాడి చేశారు. దాడిలో రూ.6,300 నగదు, అయిదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తొమ్మిది మంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

దమ్మపేట: క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. సోమవారం మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి క్రికెట్ పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. క్రీడాకారులతో కలసి సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలిన క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, జలగం వాసు, చిన్నశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పట్టని ప్రభుత్వం

అశ్వాపురం: తెలంగాణ ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారాలతో ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య విమర్శించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధరణి వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను సీఎం కేసీఆర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రజలు ఏం సంతోషంగా ఉన్నారని ఉత్సవాలు చేస్తున్నారని ఆయన బీఆర్‌ఎస్ నాయకులను ప్రశ్నించారు. వీఆర్‌ఓ వ్యవస్థను తీసివేసి కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు.

పని కల్పించాలి

చర్ల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పని కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం చర్లలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో కూలీలు ఉపాధిహామీ పథకం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్డీ భద్రాచలం సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మాట్లాడుతూ.. ప్రతీ కుటుంబానికి ఉపాధిహామీ జాబ్‌కార్డు ఇవ్వాలని, ప్రతీ కుటుంబానికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రోజుకు రూ.600 కూలి చెల్లించాలని ఆయన డిమాండ్ కోరారు. కర్యక్రమంలో నాయకులు బొర్రా సమ్మక్క, కారం సమ్మక్క, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

రావికంపాడులో బడిబాట

చండ్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం జరిగింది. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.కృష్ణ, రాములు, బి.కరుణ, ఏ.లక్ష్మణ్ పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చనలు, అన్నాభిషేకం, దూపదర్శనం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు.

రాష్ట్ర విద్యుత్ రంగం దేశానికే ఆదర్శం

- 24 గంటల విద్యుత్ రాష్ట్ర ఆవిర్భావం తర్వాతే సాధ్యమైంది..
- అన్ని రంగాలకు సరఫరా చేయగలిగాం..
- దశాబ్ది ఉత్సవాల్లో వక్తలు



మణుగూరురూరల్: తెలంగాణ విద్యుత్ ప్రగతి ర్యాలీలో విప్ రేగా కాంతారావు


భద్రాచలంఅర్బన్: కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈ హీరాలాల్


అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

మణుగూరురూరల్: విద్యుత్‌రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సీఈ బిచ్చన్న ఆధ్వర్యంలో తెలంగాణ విద్యుత్ ప్రగతి ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన రేగా కాంతారావు.. కార్యక్రమాన్ని ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శాఖతోనే తెలంగాణ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తోందని, అందుకు కోసం ఏర్పాట్లలో భాగంగా మణుగూరు, పినపాక మండలాల సరిహద్దు ప్రాంతాల్లో 1080 మెగావాట్ల సామర్థ్యంతో బీటీపీఎస్‌ను నిర్మించుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రధాన కారణమని విద్యుత్ సౌకర్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీటీపీఎస్, జెన్‌కో అధికారులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో తెలంగాణ ముందంజ

అన్ని రంగాల అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలోని గుట్టమల్లారంలో గల హనుమాన్ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్‌శాఖ భద్రాచలం డీఈ జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేను విద్యుత్‌శాఖ డీఈ జీవన్ కుమార్, అధికారులు శాలువాతో సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ విద్యుత్‌శాఖ అధికారులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యుత్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోతలు లేని విద్యుత్ సరఫరా

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావించిన తర్వాతే కోతలు లేని విద్యుత్ వెలుగులు అందుతున్నాయని, చీకట్లను పారద్రోలిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో సోమవారం విద్యుత్ విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరైన ఆయన మాట్లాడుతూ.. గడిచిన 30 ఏళ్లుగా విద్యుత్ సౌకర్యం లేక అనేక గ్రామాలు అంధకారంలో మగ్గుతుండగా, స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాతే ఆయా గ్రామాల్లో విద్యుత్ వెలుగులు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీనికి అశ్వారావుపేట నియోజకవర్గంలోనే అనేక గ్రామాలు నిదర్శనంగా ఉన్నాయని అన్నారు. అనంతరం స్థానిక డిస్కం ఏడీఈ బసవ వెంకటేశ్వర్లును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. విజయోత్ససభలో సంప్రదాయ నృత్యాలు చేసి ఆకట్టుకున్న చిన్నారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీలు సీహెచ్.వరలక్ష్మి, పైడి వెంకటేశ్వరరావు, అన్ని మండలాల ఎంపీపీలు, సర్పంచ్‌లు, ట్రాన్స్‌కో, డిస్కం అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను అధికారులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ విజయలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చిన్నరులు గీతాలాపన చేయగా, అధికారులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా భద్రాచలం నియోజకవర్గ విద్యుత్ శాఖ కన్వినర్ డీఈ హీరాలాల్ మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిది ఏళ్లుగా భద్రాచలం డివిజన్ పరిధిలోని పట్టణాలకు, మండలలాకు, గ్రామాలకు విద్యుత్ శాఖ అధ్వర్యంలో అందిస్తున్న వివిధ రకాలు సదుపాయాలు, విద్యుత్ రంగంలో వచ్చిన మార్పులు, రాయితీలు ఇలా వివిధ రకాల కార్యక్రమాలపై ఆయన అవగాహన కల్పించారు. భద్రాచలం డివిజన్ పరిధిలో పల్లెప్రగతి, పట్టణప్రగతి కర్యక్రమంలో భాగంగా రూ.1.17 కోట్లు ఖర్చు చేసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, సకాలంలో పూర్త చేసినట్లు ఆయన తెలిపారు. షెడ్యుల్డ్ తెగలకు ప్రత్యేక అధివృద్ధి నిధి, సీఎం గిరివికాసం పథకాల ద్వారా రూ.4.05 కోట్లు ఖర్చు చేసి రైతు కూలీని రైతు బిడ్డగా తెలంగాణ ప్రభుత్వం మార్చిందని ఆయన తెలిపారు. ఇలా భద్రాచలం డివిజన్ పరిధిలో 112.36 కోట్ల రూపాయల వ్యయంతో విద్యుత్ సరఫరా అభివృద్ధి జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం విద్యుత్ శాఖ ఏడీఈ వేణు, భద్రాచలం ఏఈ మైథిళీ, సారపాక ఏఈ ఉపేందర్, భద్రాచలం డివిజన్ మండలాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మేలు

భద్రాచలంఅర్బన్: పర్యావరణ పరిరక్షణతో మానవాళి మనుగడకు మేలు జరుగుతుందని భద్రాచలం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పట్టణంలో పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించుకోవాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించకోవాలన్నారు. కార్యక్రమంలో భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ వేకంటేశ్వర్లు, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలంఅర్బన్: కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి..

ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం చేపట్టి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని గ్రీన్ భద్రాద్రి సభ్యులు కోరారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా భద్రాచలం పట్టణంలోని మారుతి నర్సింగ్ కాలేజీలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణం గురించి సంస్థ సభ్యులు వివరించారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నివారణ, నీటి యాజమాన్యం, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మారుతి కళాశాల కరస్పాండెంట్ డా.ఎస్ఎల్ కాంతారావు, టి.సిద్దులు, యేగి సూర్యనారాయణ, గోళ్ల భూపతిరావు, రాజారెడ్డి, కృష్ణార్జునరావు, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, రాంబాబు, కృష్ణ, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, తిలక్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అశ్వారావుపేటరూరల్: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాల్సిన అవసరముందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ అహ్మద్ హుస్సేన్ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్లాస్టిక్ నిర్మూలనపై మేధోమథనం నిర్వహించి ప్లాస్టిక్ నివారణపై చర్చించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గించాలన్నారు. లేదంటే ప్లాస్టిక్‌తో పర్యావరణానికి తీరని ముప్పు వాటిల్లుతుందని అన్నారు. అలాగే ప్లాస్టిక్ రహిత టీకప్పులను ప్రదర్శించి, విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ వెంకన్న, డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, జంబమ్మ, మధుసూధన్‌రెడ్డి, కోటేశ్వర, రమేష్, రెడ్డి ప్రియ, నీలిమ, కృష్ణ తేజ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న కళాశాల డీన్ డాక్టర్ అహ్మద్ హుస్సేన్

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ధ్యేయమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు.

మండలంలోని కూనవరం గ్రామపంచాయతీలో ఎస్‌డీఎఫ్, సింగరేణి కంపెనీ నుంచి మంజూరైన రూ.9.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బాంబేకాలనీ వరకు బీటీ రోడ్డు వైడెనింగ్, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, ముస్లిం మైనార్టీల కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. ఆ కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సర్పంచ్ ఏనిక ప్రసాద్, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీబీపై జాగ్రత్తలు పాటించాలి

అశ్వారావుపేటరూరల్: టీబీ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలని, అనుమానం ఉన్న వారు ముందస్తుగానే తగిన పరీక్షలు చేయించుకోవాలని డీటీసీవో(టీబీ) అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని గుమ్మడవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జరిగిన ఆశ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ వ్యాధిగ్రస్తులు ఇంట్లో ఉంటే మిగితా కుటుంబ సభ్యులకు కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని, అలా జరగక ముందే జాగ్రత్తలు పాటిస్తూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు పరీక్షల్లో తేలితే ముందుగానే సంబంధించిన మందులు వాడి నివారించుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై గ్రామాల్లో ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో వైద్యాధికారి మధుళిక, హెచ్‌వి.దుర్గమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.20 వేలు చెల్లించాలి

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ టన్ను గెలలకు మద్దతు ధర రూ.20వేలు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గెలల దిగుబడికి, ఆయిల్ ఫెడ్ చెల్లించే టన్ను ధరలు రైతులకు గిట్టుబాటు కావడం లేదని వాపోయారు. గతేడాది పెరిగిన టన్ను ధర ఆధారంగా కార్మికుల వేతనం, గెలల రవాణా ఖర్చు పెరిగిందని దాంతో రైతులపై భారం పడుతుందని అన్నారు. ప్రతి నెలా గెలల ధరలు తగ్గిపోతుండటంతో రైతులకు తీరని నష్టం వాటిల్లుతోందని అవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 13వ తేదీన అశ్వారావుపేటలో జరిగే ఆయిల్‌పాం రైతు రాష్ట్ర స్థాయి సదస్సుకు హాజరై గిట్టుబాటు ధరను ప్రకటించాలని ఆయన ఆయిల్‌ఫెడ్‌ను కోరారు. కార్యక్రమంలో నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, చిరంజీవి, పిట్టల అర్జున్ పాల్గొన్నారు.

బాధితులకు బరకాలు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని సున్నంబట్టి గ్రామంలో ఆదివారం వీచిన గాలి దుమారానికి ఇళ్ల పైకప్పులు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆయన అనుచర నాయకుడు డాక్టర్ తెల్లం వెంకట్రావ్ ఆర్థిక సహాయంతో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ బరకాలు అందజేశారు. ఆదివారం సాయంత్రం వీచిన భారీ గాలులకు ఓ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన 8 ఇళ్ల రేకులు మొత్తం పడిపోయాయి. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఇళ్ల పైకప్పుల విషయాన్ని వెంట్రావ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో ప్రగలపల్లి సర్పంచ్ లక్ష్మి, పెద్దిరాజు, వెంకనరాజు, రమేష్, జయసింహా, అర్జున్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు బరకాలు అందజేస్తున్న జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ

పోడుభూములకు పట్టాలివ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బూర్గంపాడు: ఏళ్లతరబడి పోడుసాగు చేసుకుంటున్న గిరిజనులందరికీ పోడు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు కోరారు.

సోమవారం బుడ్డగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతులతో కలసి తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడుభూముల సర్వే లోపభూయిష్టంగా జరిగిందన్నారు. ఇప్పటికైనా ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు పోడు భూముల సర్వేను సమగ్రంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు ఎస్‌కె.అబీదా, కొర్సా సైదమ్మ, మడకం నాగమణి, కల్లూరి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష నిర్వహణను విరమించుకోవాలి

చర్ల: ఆశా కార్యకర్తలకు అర్హత పరీక్షను నిర్వహించి ఉత్తీర్ణులైన వారిని మాత్రమే కొనసాగించి మిగిలిన వారిని తొలగించాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కొయ్యూరు, సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలల్లో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు పేదలకు వైద్య సేవలనందిస్తున్నారని, మాతా శిశు మరణాలను తగ్గించడం, గ్రామీణ ప్రాంతాలలో జ్వరపీడితులను గుర్తించడం వంటి సేవలను అందించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వీరిని ప్రభుత్వం వైద్య సిబ్బందిగా గుర్తించి కనీస వేతనం చెల్లించాల్సిందిపోయి అర్హత పరీక్ష తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. అనంతరం వైద్యాధికారులు డాక్టర్ దివ్యనయన, డాక్టర్ శ్రీధర్‌లకు వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాలలో సీఐటీయూ నాయకులు శ్యామల వెంకట్, కేవీపీఎస్ నాయకులు మచ్చా రామారావు, ఆటో యూనియన్ నాయకులు బాలాజీ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు రాంబాయి, చంద్రకళ, హైమ, సుశీల, లీలావతి, ఉషా, కవిత, రాధా, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


చర్ల: వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

అశ్వారావుపేటరూరల్: ఆశ కార్యకర్తల వేతనాన్ని రూ.18వేలకు పెంచాలని, పరీక్షలను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ, ఆశ కార్యకర్తల ఆధ్వర్యంలో వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులకు సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్త యూనియన్ బాధ్యులు భారతి, సమత మాట్లాడుతూ.. పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత కాకపోతే తొలగించాలనే ఆలోచన తగదన్నారు. ఆశ కార్యకర్తలకు నష్టాన్ని కలిగించే ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిన్నె నాగమణి, వాణి, శాంతి, రమాదేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దుమ్ముగూడెం: మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రేసు లక్ష్మి అధ్యక్షతన నేడు(మంగళవారం) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ముత్యలరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

రక్తదాన శిబిరం

గుండాల: వన్ లైఫ్ బ్లడ్ బ్యాంక్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, ఏఆర్ ఎస్సై గడ్డం సతీష్ ఆధ్వర్యంలో సోమవారం గుండాల మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా, సికెల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. 54 మంది బ్లడ్ డొనేషన్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వారికి పండ్లు, జ్యూస్ అందించి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. వాట్సాప్ మెస్సేజ్‌కు స్పందించి బ్లడ్ డొనేషన్ క్యాంపును ఏర్పాటు చేసిన సతీష్‌కు స్థానికులు అభినందించారు. ఎప్పుడు ఎవరికీ బ్లడ్ అత్యవసరమైనా 9866919343 నంబర్కు ఫోన్ చేయొచ్చని ఈ సందర్భంగా సతీష్ తెలిపారు.

సిద్ధంగా ఉన్న విత్తనాలు

చండ్రుగొండ: నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు గానుగపాడు సహకార సంఘం చైర్మన్ చెవుల చందర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటల నుంచి విత్తనాల విక్రయాలు ప్రారంభిస్తామన్నారు. కావాల్సిన రైతులు వ్యవసాయశాఖ నుంచి కూపన్లు తీసుకోవాలన్నారు. ఆధార్‌కార్డ్, భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం, కూపన్ తీసుకుని రావాలని, జీలుగులు, జనుములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సమ్మెకు మద్దతు

మణుగూరురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీటీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఎనిమిదో రోజుకు చేరింది. సమ్మె శిబిరాన్ని టీడీపీ నియోజకవర్గ నాయకుడు వట్టం నారాయణదొర సందర్శించి పార్టీ నియోజకవర్గ కమిటీ తరపున సంపూర్ణ మద్దతును తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చందా మధుసూధన్‌రావు, మేదరమెట్ల శ్రీనివాస్, దొడ్డి కృష్ణ, తోట వెంకటేశ్వర్లు, కూచిపూడి వెంకటేశ్వరరావు, ధర్మరాజుల శంకర్, కమురున్నీసా బేగం, పసునూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో అనర్థాలు

- ప్లాస్టిక్ కవర్లలో ఆహార వ్యర్థాలు పడేస్తున్న జనం
- ఆహారంతోపాటు కవర్లను మేస్తున్న పశువులు
- మొదట అనారోగ్యం.. ఆపై మృత్యువాత


ఆహారంతో కలిసిన పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలను మేస్తున్న పశువులు

బూర్గంపాడు: పాలిథీన్, ప్లాస్టిక్ కవర్లు పశువుల పాలిట యమపాశాలుగా మారాయి. పాలిథీన్, ప్లాస్టిక్ కవర్లలో ఉన్న వ్యర్థ ఆహారపదార్థాలను తినేందుకు వస్తున్న పశువులు.. ఆ క్రమంలో కవర్లను తిని అనారోగ్యానికి గురవుతున్నాయి. పశువులలో జీర్ణక్రియకు ప్రతిబంధకంగా మారి.. అరగక కడుపులోనే నిల్వవుంటున్నాయి. క్రమేపీ పశువులు అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయి.

ప్రస్తుతం భోజన హోటళ్లలో, టిఫిన్ సెంటర్లలో, రెస్టారెంట్లలో ప్లేట్లలో పాలిథీన్ కవర్లు పెట్టి ఆహారాన్ని అందిస్తున్నారు. భోజనం, టిఫిన్లు చేసిన తరువాత ప్లేట్లు శుభ్రం చేసుకునే క్రమంలో హోటళ్ల నిర్వాహకులు ఆ పాలిథిన్ కవర్లను తీసి డస్ట్‌బిన్‌లో వేస్తున్నారు. తరువాత ఆ డస్ట్‌బిన్‌లోని కవర్లు, ఆహార వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు డంపింగ్ యార్డుకు తరలించి పారబోస్తున్నారు. అలా డంపింగ్ యార్డులలో పారబోసిన ఆహార వ్యర్థాలను పశువులు తింటున్నాయి. పాలిథిన్ కవర్లలో ఉండే అన్నం, కూరలు, చట్నీలు, ఇతర ఆహార వ్యర్థాల కోసం వచ్చిన పశువులు.. కవర్లతో సహా తింటున్నాయి. అదేవిధంగా కూరగాయలు, పండ్లు తీసుకు వచ్చిన పాలిథీన్ కవర్లలోనే చాలామంది పండ్ల తొక్కలు, వ్యర్థాలను పడేస్తున్నారు. అవి కూడా డంపింగ్‌యార్డుకు చేరి.. ఆపై పశువుల కడుపుల్లోకి చేరుతున్నాయి.

వాస్తవానికి పశువులు కేవలం ఒక అరకిలో మోతాదుకు మించిన అన్నం వంటి ఆహారాన్ని ఎప్పుడూ తీసుకోకుడదని పశువైద్యులు చెబుతున్నారు. మిగిలిన అన్నం పశువులకు ఇవ్వాలంటే తౌడు, చెక్క వంటి వాటితో కలిపి కుడితిగా ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. కానీ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల మూలంగా అంతకు మించి సమస్యలను పశువులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం పాలిథీన్, ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా ఆరికట్టాల్సి ఉంది. పశువుల సంరక్షణకు డంపింగ్‌యార్డులలో ఆహార పదార్థాలు కలిసిన పాలిథీన్ కవర్లు వేయకుండా చర్యలు తీసుకోవాలని పశువుల యజమానులు కోరుతున్నారు.

వ్యర్థాలతో పశువులకు అనారోగ్యం



ఆహార వ్యర్థాలు తింటే పశువులు అనారోగ్యానికి గురవుతాయి. పశువులకు ఎక్కువగా ఎండుగడ్డి, పచ్చిగడ్డినే మేతగా ఇవ్వాలి. పశువులకు ఎట్టి పరిస్థితుల్లో నెమరుకు రానటువంటి అన్నం, కూరలు వంటి వాటిని ఆహారంగా ఇవ్వవద్దు. ముఖ్యంగా హోటళ్ల నుంచి పారేసిన పాలిథీన్, ప్లాస్టిక్ కవర్లలో ఉన్న ఆహారాన్ని తినటం మరింత ప్రమాదకరం. పశువుల కడుపులో ప్లాస్టిక్, పాలిథీన్ కవర్లు పేరుకుపోయి పశువులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నాయి. కొన్ని సందర్భాలలో పశువులకు అపరేషన్లు చేసి పాలిథీన్ కవర్లను బయటకు తీసిన సందర్భాలున్నాయి. ఆహార వ్యర్థాల పట్ల పశువుల యజమానులు జాగ్రత్తగా ఉండి పశువులను కాపాడుకోవాలి.

– డాక్టర్ రవీందర్, మండల పశువైద్యాధికారి